క్లుప్తంగా

45 మంది రక్తదానం

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంకు చెందిన జీఎస్ రావు జిల్లా పరిషత్ హైస్కూల్లో మానవతా సంస్థ మాజీ అధ్యక్షుడు సాయన సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో 45 మంది దాతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, మానవతా మాజీ అధ్యక్షుడు సాయన సుబ్బారావు, తిగిరిపల్లి చిన్న దోషాలు, సభ్యులు మానేపల్లి గోవింద రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తాళ్లపూడి: మండలంలోని పోచవరం గ్రామంలో రాగోలపల్లి సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు యలమర్తి గౌతమ్ రాయుడు, బాలకృష్ణ అరిగెలు సుమారు 100 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

రేపు సెపక్ తక్రా పోటీలు

దేవరపల్లి: జిల్లాస్థాయి బాల, బాలికల సీనియర్ విభాగం సెపక్ తక్రా పోటీలు ఈ నెల 16న దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూలు క్రీడా మైదానంలో జరుగుతాయని పీడీ తలారి సరస్వతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని, ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చని సూచించారు.

లాక్ సూపరింటెండెంట్ల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేసిన వీర్రాజు, బ్రహ్మాజీరావు, విజయ్‌కుమార్

నిడదవోలు రూరల్: లాక్ సూపరింటెండెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.విజయ్‌కుమార్ అన్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిడదవోలు డివిజన్‌కు చెందిన పలువురికి రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల బ్రహ్మాజీరావు తెలిపారు. సమిశ్రగూడెం గ్రామానికి చెందిన జలవనరుల శాఖ వెస్ట్రన్ డివిజన్ గౌడిచర్ల లాక్ సూపరింటెండెంట్ ముప్పిడి విజయ్‌కుమార్‌ను అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, కాట్రు వీర్రాజు (సమిశ్రగూడెం) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను లాక్ సూపరింటెండెంట్లు, లస్కర్లు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



వెంకటకృష్ణ ప్రసాద్‌ను సత్కరిస్తున్న సంఘ సభ్యులు

నిడదవోలు (ఉండ్రాజవరం): మండలంలోని మోర్త గ్రామంలోని ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న చెరుకూరి వెంకటకృష్ణ ప్రసాద్‌ను అఖిలాంధ్ర ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. ఈ మేరకు గుంటూరులోని బ్రాడీపేటలో బ్రాహ్మణ సేవా సమితి సంఘ భవనంలో ఆదివారం చెరుకూరి వెంకట కృష్ణప్రసాద్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. ఉండ్రాజవరం బ్రాహ్మణ నాయకులు ఆకెళ్ల శ్రీనివాసరావు, దోనేపూడి సుధాకర్, ఇ.సత్యకృష్ణులు ఆయన్ని అభినందించారు.

నీరుగారుతున్నాయ్..

- నియోజకవర్గంలో 59 ఓవర్ హెడ్ ట్యాంకులు
- నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం
- జీటలు వారి కూలేందుకు సిద్ధం

దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం నిర్మించిన మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతాయో తెలియక స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ట్యాంకు పిల్లర్లలోని ఇనుప చువ్వలు తుప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. పలు గ్రామాల్లో ట్యాంకుల అడుగు భాగం పెచ్చులు ఊడి నీరు కారుతున్నాయి. దీంతో వర్షాకాలం కావడంతో ట్యాంకుల సమీపంలో నివసిస్తున్న ప్రజలు భయం గుప్పిట్లో కాలం వెల్లదీస్తున్నారు. శిథిలమైన ట్యాంకులకు మరమ్మతులు చేయించి, కొత్త ట్యాంకుల నిర్మాణాలను చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.

కాలం చెల్లిన ట్యాంకులు

గోపాలపురం నియోజకవర్గ వ్యాప్తంగా వాటర్ ట్యాంకులు కాలం చెల్లాయి. ట్యాంకులు నిర్మించి 40 సంవత్సరాలు కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వివిధ గ్రామాల్లో సైతం ట్యాంకులు మొత్తం పెచ్చులు ఊడిపోయి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. పలుమార్లు మరమ్మతులు చేసినా మరలా పగుళ్లు ఏర్పడ్డాయని ఆరోపిస్తున్నారు. వాటర్ ట్యాంకుల సమీపంలో పెద్ద సంఖ్యలో నివాసాలు ఉన్నాయని, దీంతో ట్యాంకులు ఎప్పుడు కూలుతాయో తెలియక ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు.



త్యాజంపూడిలో శిథిలావస్థకు చేరుకున్న ఓవర్ హెడ్ ట్యాంక్



దుద్దుకూరులో కూలేందుకు సిద్ధంగా ఉన్న 40 ఏళ్ల నాటి ట్యాంకు

పెచ్చులూడి.. ఇనుప చువ్వలు బయటపడి

దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం మండలాల్లో సుమారు 59 ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. దేవరపల్లి మండలం త్యాజంపూడి, లక్ష్మీపురం, దేవరపల్లి, సంగాయగూడెం, చిన్నాయగూడెం, గొల్లగూడెం, బుచ్చియపాలెం, యర్నగూడెం గ్రామాల్లో ట్యాంకులు నిర్మించి దాదాపు 30 నుంచి 40 సంవత్సరాలు కావస్తున్నాయి. త్యాజంపూడిలోని ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దుద్దుకూరులో మెయిన్ రోడ్డులో సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. ట్యాంకు పిల్లర్లు బీటలు తీసి, నీరు బయటకు కారుతుంది. దేవరపల్లిలో శివాలయం వద్ద గల ట్యాంకు శిథిలావస్థకు చేరుకుని నీరు కారుతుంది. లక్ష్మీపురం పంచాయతీ వద్ద 32 సంవత్సరాల క్రితం నిర్మించిన ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గోపాలపురం మండలంలో సుమారు 12 ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రతి ఏటా వాటికి తాత్కాలికంగా మరమ్మతులు చేసి నీటి సరఫరా చేస్తున్నారు. పొంచి ఉన్న ప్రమాదాలను గమనించి కొత్త ట్యాంకుల నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యం

ఈ సమస్యపై పాలకులు కానీ, అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. నియోజకవర్గంలో పూర్తిగా మంచినీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతో ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. మంచినీటి ట్యాంకుల నిర్వహణ బాధ్యత పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు పర్యవేక్షించాల్సి ఉండగా చాలా గ్రామాల్లో వారెవరూ కనీసం ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ట్యాంకులు నిర్మించాలి

ట్యాంక్ పెచ్చులు ఊడి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్నా ఎందుకు తొలగించటం లేదని, ఏదైనా జరగరానిది జరిగి, ప్రాణనష్టం జరిగితేనే అధికార యంత్రాంగం స్పందిస్తారా.. అని ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా ట్యాంకులు నిర్మించేందుకు ఇప్పటికైనా అధికారులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు స్పందించి ట్యాంకుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



నియోజకవర్గంలోని మూడు మండలాల్లో శిథిలావస్థకు చేరుకున్న ట్యాంకులను గుర్తించాం. వాటి స్థానంలో కొత్త ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.పార్వతి, డీఈఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, కొవ్వూరు

కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసియున్న కోట సత్తెమ్మ ఆలయంలో ఆదివారం భారీ ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయాల ద్వారా రూ.1,31,626 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దాల మందిరానికి ఏసీల బహూకరణ

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నంలో వెంచేసియున్న క్రైస్తవ పుణ్యక్షేత్రం నిర్మలగిరిలోని మేరీ మాత ప్రధాన మందిరాన్ని భక్తులు ప్రార్థనల కొరకు అద్దాల మండపంగా తీర్చిదిద్దుతున్నట్టు పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జాన్‌పీటర్ ఆదివారం తెలిపారు. ఏలూరు పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ జయరావు పొలిమెర పర్యవేక్షణలో మండపాన్ని తీర్చిదిద్దుతున్నట్టు ఆయన వివరించారు. ఈ సందర్భంగా పుణ్యక్షేత్రంలోని ఉచిత అన్నదాన నిర్వాహకులు కళ్లే నాగేశ్వరరావు నూతన మందిరానికి రెండు ఏసీలను ఫాదర్ జాన్‌పీటర్‌కు అందజేశారు. అసిస్టెంట్ ఫాదర్లు శివ, శ్యామ్ అనిల్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోల్డ్ వార్

- సద్దుమణగని జనసేన– టీడీపీ వివాదం
- దీక్షకు సిద్ధమైన ఏఎంసీ డైరెక్టర్

తాళ్లపూడి(కొవ్వూరు): కొవ్వూరులో ఇటీవల జరిగిన జనసేన, టీడీపీ నాయకుల మధ్య వివాదం ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో ఆదివారం దొమ్మేరు గ్రామంలో జనసేనకు చెందిన కొవ్వూరు ఏఎంసీ డైరెక్టర్ గంగుమళ్ల స్వామి ఇంటి దగ్గర నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల ఎనిమిదో తేదీన కొవ్వూరు టీడీపీ కార్యాలయం వద్ద జనసేనకు చెందిన కొవ్వూరు ఏఎంసీ డైరెక్టర్ గంగుమళ్ల స్వామిని, మైగాపుల బాలకృష్ణలను టీడీపీకి చెందిన కొంతమంది యువకులు కొట్టారని.. ఈ దాడి జరిగిన రోజు రాత్రి బాధితుడు గంగుమళ్ల స్వామి దొమ్మేరు గ్రామంలో తన ఇంటి వద్ద న్యాయం చేయాలని జనసేన నాయకులతో కలిసి ఆందోళనకు సిద్ధమయ్యారు. మరుసటి రోజు మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి దాడి జరిగిన తీరును వివరించగా, వారం రోజులు గడుస్తున్నా న్యాయం చేయకపోవడంపై ఆదివారం ఉదయం మరలా స్వామి దొమ్మేరులో దీక్షకు పూనుకున్నారు. ఈ విషయమై మంత్రి కందుల దుర్గేష్, జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరాజు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావులతో పార్టీ నాయకులు మాట్లాడారని, మూడు రోజుల్లో పార్టీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు సమక్షంలో ఈ సమావేశం పెట్టి పరిష్కరిస్తామని చెప్పినట్టు జనసేన నాయకులు వివరించారు. ఈ సమావేశంలో నియోజవర్గ మూడు మండలాల జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జనసేన నాయకులతో కొవ్వూరు ఏఎంసీ డైరెక్టర్ గంగుమళ్ల స్వామి

దోచుకో, దాచుకో అనేలా పాలన

తాళ్లపూడి: రాష్ట్రంలో ఇసుక, మద్యం ఇలా అన్నింటా కూటమిగా జట్టుకట్టి దోచుకో,దాచుకో అన్న చందంగా ప్రస్తుత ప్రభుత్వ పాలన సాగుతుందని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మండిపడ్డారు. మండలంలోని పోచవరంలో ఆదివారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మండల నాయకులతో కలిసి గ్రామంలో చంద్రబాబు మోసాలపై ప్రజలకు వివరించేందుకు రచ్చబండ నిర్వహించారు. ఈ సమావేశంలో తలారి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం తీసుకుని వచ్చి రాష్ట్రానికి ఆదాయం లేకుండా చేసిందన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక ద్వారా ప్రభుత్వానికి ఏటా ఆదాయం వచ్చేదన్నారు. నేడు ఆ సొమ్మంతా కూటమి నాయకుల జేబుల్లోకి చేరుతుందని ఆరోపించారు. ఉచిత ఇసుక ముసుగులో ఇతర రాష్ట్రాలకు ఇసుకను తరలించి అక్రమ వ్యాపారం సాగిస్తున్నారన్నారు. ఎక్కడికక్కడ ఇసుక గుట్టలు పెట్టి అక్రమ దందాకు పాల్పడుతున్నారని విమర్శించారు. పేదలకు మాత్రం ఉచిత ఇసుక అందని ద్రాక్షగానే ఉందన్నారు. సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి పథకాలు అమలు చేయకుండా ఉండడం మోసం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరావు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి పరశురామారావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్ బాబు, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి పరిమి సోమరాజు, కొవ్వూరు పట్టణ కన్వీనర్ చిట్టూరి అన్నవరం, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, గ్రామకమిటీ అధ్యక్షుడు మద్దుకూరి దొరబాబు, వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, పార్టీ ముఖ్య నాయకులు తోట రామకృష్ణ, వంబోలు పోశిబాబు, ఉప్పలపాటి మోహన్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పోచవరం గ్రామస్తులకు బాబు మోసాలను వివరిస్తున్న తలారి వెంకట్రావు, నాయకులు

కార్మిక లోకానికి 'కూటమి' నమ్మక ద్రోహం

నిడదవోలు: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల ఓట్లతో గద్దెనెక్కిన కూటమి పాలకులు కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించారని, 15 నెలల పాలనలో ఒక్క హామీని అమలు చేయలేదని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు విమర్శించారు. పట్టణంలోని కామాక్షి విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘ సమావేశాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బద్దా వెంకట్రావు మాట్లాడుతూ దశాబ్దాలుగా భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టబద్ధమైన వివిధ ఆర్థిక ప్రయోజనాలతో కూడిన వివిధ పథకాలను పాలకులు నిలుపుదల చేసి కార్మిక లోకానికి ద్రోహం చేశారని మండిపడ్డారు. నాయకులు ఈమని గ్రీష్మకుమార్, ఏలూరు, జంగారెడ్డిగూడెం, ఆకివీడు, పెదవేగి, తాడేపల్లిగూడెం, కొవ్వూరు, దేవరపల్లి, తాళ్లపూడి, బుట్టాయగూడెం, దెందులూరు, దేవరపల్లి, వంగిడి తదితర ప్రాంతాలకు చెందిన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

చలో విజయవాడను జయప్రదం చేయండి

నల్లజర్ల: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందించాలనే డిమాండ్‌తో ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంఘం పిలుపు మేరకు ఈ నెల 15న విజయవాడలో భవననిర్మాణ కమిషనర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు సీఐటీయూ జిల్లా నాయకులు కొక్కిరపాటి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పోతవరంలో బొంగు వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన భవననిర్మాణ కార్మికుల సంఘ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ కార్మికులు నిత్యం ప్రమాదాల అంచున పనిచేస్తున్నారని, నిర్మాణ పనుల్లో ప్రమాదాలకు గురైన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. సుదీర్ఘ పోరాటాలతో 2005లో బోర్డు ఏర్పాటైందన్నారు. బోర్డులో నమోదైన ప్రతి కార్మికుడికి సంక్షేమ ఫలాలు అమలయ్యేవన్నారు. వసూలైన సెస్ బోర్డులో జమయయ్యేవని వాటితోనే పథకాలు అమలయ్యేవన్నారు. ప్రస్తుతం బోర్డులో మూడు వేల కోట్లు నిధులు ఉన్నా క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉంచడం, పథకాలు నిలుపుదల చేయడంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాలన్నీ పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చిందన్నారు. హామీలను అమలు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం దున్నపోతు మీద వర్షం కురిసిన చందాన వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈ నేపథ్యంలో భవననిర్మాణ కార్మికులు చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బల్లంకి చిట్టిబాబు, రాగోలు శ్రీను, భీమాడ శ్రీనివాస్, ముద్దన రామలింగేశ్వరావు, విస్సాకోడేటి శ్రీనివాసరావు, రాయలవరపు సత్యనారాయణ, పెనుమాక వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



పోతవరంలో ఐక్యత చాటుతున్న భవన నిర్మాణ కార్మికులు

రహదారికి మోక్షమెప్పుడో..?

దేవరపల్లి: మండల పరిధిలోని 2015–16 సంవత్సరంలో నిడదవోలు నుంచి పొంగుటూరు వరకు సుమారు రూ.16 కోట్లతో రహదారి విస్తరణ చేశారు. త్యాజంపూడి నుంచి యర్నగూడెం మధ్య సుమారు 2 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. గత ఏడాది రూ.26 లక్షలతో గోతులు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మరలా పూర్తిగా దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిపై ప్రయాణమంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దాదాపు 10 ఏళ్లుగా రోడ్డు దుస్థితి ఇలాగే ఉందని, ఎన్ని ప్రభుత్వాలు మారినా మోక్షం కలగలేదని స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాస్‌ని వివరణ కోరగా రోడ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు.



చెరువును తలపిస్తున్న యర్నగూడెం-త్యాజంపూడి రహదారి

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి

నిడదవోలు: పట్టణంలోని 15వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు, సోమేశ్వరస్వామి వారి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు దాసరి శ్రీనివాసరారావు (52) శనివారం రాత్రి గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. ఈయనకు భార్య సరోజిని, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ చిరు వ్యాపారిగా వివాద రహితుడిగా పేరొందారు.



దాసరి శ్రీనివాసరావు

సిర్రా బ్రదర్స్‌కు నాయకుల పరామర్శ



సుజనమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెలగా శ్రీరామమూర్తి తదితరులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి సిర్రా గంగారావు, సిర్రా గోపీల తల్లి సిర్రా సుజనమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా కుమారులు గంగారావు, గోపీలను ఆదివారం గోపాలపురం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, మండల టీడీపీ నాయకులు అల్లూరి విక్రమాదిత్య పరామర్శించి సుజనమ్మ మృతికి తమ సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, మండలంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నసమారాధనలు

నిడదవోలు రూరల్: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా నిడదవోలు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అన్నసమారాధనలు నిర్వహించారు. సమిశ్రగూడెంలో నందిబొమ్మ వద్ద, పెండ్యాల, కలవచర్ల గ్రామాల్లో జరిగిన అన్నసమారాధనలకు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతుబజార్లలో కర్నూలు ఉల్లి విక్రయాలు



రైతుబజార్‌లో ఉల్లి కోసం లైన్‌లో నిలిచిన వినియోగదారులు



రైతుబజార్ షాపులో మహారాష్ట్ర ఉల్లిపాయలపై గోనెసంచి మూతవేసిన దృశ్యం

- కిలో రూ.10కి విక్రయిస్తున్నా నాసిరకం అంటున్న వినియోగదారులు
- మహారాష్ట్ర ఉల్లిపాయల అమ్మకాలు నిలిపివేసిన అధికారులు
- రేటు ఎక్కువైనా నాణ్యమైనవి విక్రయించాలని వినతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కర్నూలు జిల్లాలో ఉల్లిరైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లిపాయలు కొనుగోలు చేసి పదిరోజులుగా జిల్లాలోని రైతుబజార్లలో విక్రయాలు జరుపుతోంది. అయితే కర్నూలు ఉల్లిపాయలు కిలో రూ.10కి విక్రయిస్తున్నా నాసిరకంగా ఉండడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా కర్నూలు ఉల్లిపాయలతో పాటు మహారాష్ట్ర ఉల్లిపాయలను కూడా రైతుబజార్లలో విక్రయిస్తుంటారు. అయితే కొద్దిరోజులుగా ఉన్నతాధికారులు రైతుబజార్లలో మహారాష్ట్ర ఉల్లిపాయలు విక్రయాలు జరపరాదని ఎస్టేట్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో కేవలం కర్నూలు ఉల్లిపాయలు మాత్రమే విక్రయిస్తున్నారు. రూ.10కి కర్నూలు ఉల్లి ఎన్ని కిలోలు అయినా ఇస్తామని రైతులు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. కర్నూలు ఉల్లి నాసిరకంగా ఉండడంతో ఎక్కువ రోజులు నిల్వ ఉండవని వినియోగదారులు అధికారుల వద్ద మొర పెట్టుకుంటున్నారు. రైతుబజార్‌లలో షాపుల వద్ద మహారాష్ట్ర ఉల్లిపాయలుపై గోనెసంచులు కప్పి ఉంచడంతో వినియోగదారులు వాటిని విక్రయించాలని రైతులతో వాదనకు దిగారు. ఉల్లిపాయలు ఉన్నప్పటికీ అధికారులు ఆదేశాలు మేరకు కర్నూలు ఉల్లి మాత్రమే విక్రయిస్తున్నామని రైతులు వినియోగదారులకు చెబుతున్నప్పటికీ వినే పరిస్థితి లేకపోవడంతో రైతులు, డ్వాక్రా సభ్యులు తలలు పట్టుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ అధికారి సునీల్‌వినయ్‌ను 'సాక్షి' అడుగగా ప్రభుత్వ ఆదేశాలు మేరకు కర్నూలు ఉల్లిపాయలను రైతుబజార్‌లలో విక్రయిస్తున్నామన్నారు. మరో పదిరోజుల పాటు కర్నూలు ఉల్లిపాయలు విక్రయిస్తామన్నారు. అప్పటి వరకు ప్రభుత్వం, ఉన్నతాధికారులు మహారాష్ట్ర ఉల్లిపాయలు విక్రయించవద్దని ఆదేశాలు జారీచేశారన్నారు.